ముగిసిన బదిలీల ప్రక్రియ

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో బదిలీల ప్రక్రియ సోమవారం ముగిసింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల ఏడో తేదీన బదిలీకి అర్హులైన ఉద్యోగులకు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్ధాంతరంగా ప్రక్రియను నిలిపివేశారు. పండగ సెలవుల అనంతరం బదిలీకి అర్హులైన ఉద్యోగులకు ఎస్‌ఈ, డీఈలు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌ఈ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 20 మంది సబ్ ఇంజినీర్లు, ఐదుగురు ఫోర్‌మెన్లు, నలుగురు సీనియర్ లైన్‌మెన్లు, 17 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఏడుగురు ఆఫీస్ సబార్డినేట్లు బదిలీ అయ్యారు. భువనగిరి డివిజన్ పరిధిలో 63 మంది లైన్‌మెన్లు, తొమ్మిది మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, 13 మంది ఏఎల్‌ఎంలు, ముగ్గురు జేఎల్‌ఎంలు, ఐదుగురు ఆఫీస్ సబార్డినేట్లు బదిలీ అయ్యారు. చౌటుప్పల్ డివిజన్ ఉద్యోగుల బదిలీల వివరాలు తెలియరాలేదు.

యాదాద్రిలో వైష్ణవ, శైవారాధనలు


శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవమూర్తులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం హరిహరులను కొలుస్తూ ఆరాధనా పర్వాలు ఆయా ఆలయాల ఆచారంగా కొనసాగాయి. ప్రధాన ఆలయంలో మూలవరులను మేల్కొల్పి, హారతినిచ్చి నిజాభిషేకం, తులసీ అర్చన చేపట్టారు. మహా ముఖ మండపంలో సుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. గజవాహనంపై కల్యాణమూర్తులను అలంకరించి సేవా పర్వాన్ని జరిపారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీస్వామి, ముత్యాల పల్లకిపై అమ్మవారు అలంకృతులై సేవోత్సవం పొందారు. రాత్రివేళ స్వయంభువులకు ఆరాధన, సహస్రనామార్చన జరిపారు. శివ, పార్వతుల కల్యాణం, సేవాపర్వం నిర్వహించారు. అష్టభుజి మండప ప్రాకారంలో స్ఫటిక రామలింగేశ్వరస్వామికి ఆరాధనలు జరిగాయి.

తరుగు తీస్తే చర్యలే

❑ 'న్యూస్‌టుడే'తో అదనపు కలెక్టర్(రెవెన్యూ) బెన్‌షాలోమ్


ముఖాముఖి

భువనగిరి, న్యూస్‌టుడే: వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వ్యవసాయశాఖ ఇచ్చిన దిగుబడి అంచనాల మేరకు జిల్లాలో 369 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, అందులో మూడు లక్షల టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తాయని అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సన్నరకం ధాన్యం కొనుగోలుకు 47 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. పర్యవేక్షణ కోసం మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్‌షాలోమ్ 'న్యూస్‌టుడే'కు ఇచ్చిన ముఖాముఖిలో వెల్లడించారు.

20వ తేదీ వరకు కొనుగోలు కేంద్రాలు తెరుస్తాం

ఈ నెల 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. ప్రస్తుతం జిల్లాలో పోచంపల్లి మండలంలో మాత్రమే వరి కోతలు ఎక్కువగా జరుగుతున్నాయి.

తేమ శాతం అధికం

ప్రస్తుతం అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వస్తున్న మాట నిజమే. కానీ ధాన్యంలో తేమ శాతం 20 నుంచి 45శాతం వరకు ఉంటుంది. కొనుగోళ్లకు తేమ శాతమే అవరోధంగా ఉంది. నాణ్యతా ప్రమాణాల మేరకు 15శాతం వరకే తేమ శాతం ఉండాలి. దాన్నాల్సి ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలి.

369 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 369 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించాం. సన్నరకం ధాన్యం కొనుగోళ్ల కోసం 47 కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం కేంద్రాల్లో ఐకేపీ 129, పీఏసీఎస్ 225, ఎఫ్‌పీఓలు 15 కేంద్రాలు ప్రారంభించేందుకు ముందుకొచ్చాయి.

3లక్షల మెట్రిక్ టన్నుల అంచనా

జిల్లా వ్యాప్తంగా సాధారణ, సన్నరకం ధాన్యం సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మార్కెట్‌కు వస్తుందని అంచనా వేస్తున్నాం.

ఇప్పటికే కమిటీలతో పలుసార్లు సమావేశమయ్యాం. తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాం. మార్కెటింగ్‌శాఖ అధికారులు కాంటాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, తేమ కొలిచే ఇతర యంత్రాలను సమకూరుస్తారు.

సన్నాల కొనుగోళ్లకు ..

జిల్లాలో మొత్తం 60 వేల ఎకరాల్లో సన్నరకం ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నాం. క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలన్న ప్రభుత్వ ఆదేశంతో 47 కేంద్రాలను మిల్లుకు ఏర్పాటు చేస్తున్నాం. సుమారు 30వేల ఎంటీల సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశాం. సన్నరకం ధాన్యం ఎంపిక చేసేందుకు 370 గ్రేన్ కాలిపర్స్ కొనుగోళ్లకు మార్కెటింగ్‌శాఖను ఆదేశించాం. ఏవోలు పరిశీలించి సన్నరకాలను నిర్ధారిస్తారు.

కిలో కంటే ఎక్కువ కోత విధిస్తే..

మిల్లర్లు తరుగు పేరుతో క్వింటాకు కిలో కంటే ఎక్కువ కోత విధిస్తే చర్యలు తీసుకుంటాం. రైతులు మిల్లుల వద్దకు వెళ్లొద్దు. కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. గోదాములకు సమస్యలుంటే కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేయాలి. గోదాముల్లో స్థలాభావ సమస్య లేదు. ప్రస్తుతానికి 2.70 లక్షల మెట్రిక్ టన్నుల స్థలం ఖాళీగా ఉంది. 2 వేల టార్పాలిన్లు అదనంగా కొనుగోళ్లు చేయాలని మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించాం.

ఆర్టీసీ ప్రత్యేక బాదుడు

❍ అన్ని బస్సుల్లో 50 శాతం అదనపు వసూళ్లు


మిర్యాలగూడలో కోదాడ బస్సులో సీటు కోసం పోటీపడుతున్న ప్రయాణికులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సందర్భంగా ఆర్టీసీ సంస్థ ప్రయాణికుడి జేబుకు చిల్లులు పెడుతోంది. ప్రత్యేక(స్పెషల్) బస్సుల పేరిట అకస్మాత్తుగా ఛార్జీలు పెంచేసింది. పండగకు ముందు 25 శాతం అదనంగా వసూలు చేయడం ప్రారంభించింది. ఇక తిరుగు ప్రయాణంలో మరింత ముందడుగు వేసి ఏకంగా 50 శాతం అదనంగా వసూలు చేస్తోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఏడు డిపోల పరిధిలో హైదరాబాద్ సహా పలు ప్రాంతాలకు మొత్తం 646 ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. అన్ని రూట్లలోనూ టికెట్ ధర పెంచి వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు.

పల్లెవెలుగు టిక్కెట్లు రద్దు

దసరా పండగకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు సోమవారం కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీని చూసి ఇదే అదనుగా వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అన్ని రూట్లలో పల్లెవెలుగు బస్సుల్లోనూ టిక్కెట్లు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు తీసుకుంటున్నారు. పండగ వేళ ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన ఆర్టీసీ సంస్థ టికెట్ వెల పెంచడంపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొన్ని పల్లెవెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్ బోర్డుతో పాటు ప్రత్యేకం బోర్డు పెట్టి మరింత అదనంగా దండుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. భావించిన సంస్థ యాజమాన్యం పల్లెవెలుగు బస్సుల్లోనూ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు

సాధారణ ఛార్జీలు లేవు


బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ఈ నెల 2 నుంచి 16 వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. తొలుత సాధారణ ఛార్జీలు తీసుకుంది. ఆ తర్వాత 25 శాతం అదనంగా వసూలు చేయడం మొదలుపెట్టి ప్రస్తుతం 50 శాతం అదనంగా వసూలు చేస్తోంది. సాధారణ టికెట్ ధరపై మరో సగం ఛార్జీ అదనంగా చెల్లించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. కేవలం ప్రత్యేక బస్సుల్లో మాత్రమే అదనపు ఛార్జీ వసూలు చేస్తున్న ప్పటికీ... అన్ని బస్సులకు ప్రత్యేకం బోర్డులు తగిలించారు.. సాధారణ బస్సులు అసలు

ధరలు పెంచారిలా...

రూట్	బస్సు	సాధారణ ఛార్జీ (రూ.లలో)	ప్రత్యేక ఛార్జీ (రూ.లలో)
మిర్యాలగూడ–హైదరాబాద్	సూపర్‌లగ్జరీ	290	400
సూర్యాపేట– హైదరాబాద్	ఎక్స్‌ప్రెస్	200	290
నల్గొండ– హైదరాబాద్	డీలక్స్	180	260
కోదాడ–హైదరాబాద్	ఎక్స్‌ప్రెస్	290	410
మిర్యాలగూడ– హాలియా	పల్లెవెలుగు	30	50
నల్గొండ–మిర్యాలగూడ	పల్లెవెలుగు	60	110

(పల్లెవెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ పేరుతో సూపర్ లగ్జరీ ఛార్జీ వసూలు చేశారు)

ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ప్రత్యేక బస్సుల వివరాలు..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

– రాజశేఖర్, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్గొండ

దసరా సందర్భంగా నడుపుతున్న ప్రత్యేక బస్సులు తిరుగు ప్రయాణంలో ఖాళీగా వస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నాం. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంది.

నడపడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర కులగణనకు కసరత్తు



ఈనాడు, నల్గొండ: సమగ్ర కులగణన చేపట్టేందుకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెల్లలో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని గత కొన్నాళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పల్లె ఎన్నికలకు ముందే సమగ్ర కులగణన చేపట్టనుండటం విశేషం.

కార్డీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు.

రాజకీయ అవకాశాలు లభిస్తాయని..

◆ ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మొత్తం జనాభాలో సుమారు 52 శాతం బీసీ జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఆనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని పలు సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని ఆయా వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

◆ నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఈ సర్వే జరిగే రెండు నెలల పాటు ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యుటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలిసింది. సర్కారు నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలుపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

సమగ్ర వివరాల సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్య, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ

పదేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు

మొత్తం జనాభా :	35,99,237
ఎస్సీ :	6,98,894
ఎస్టీ :	4,30,956
బీసీ :	19,47,459
ఓసీ :	5,21,928
మైనార్టీ :	2,29,662

ట్రిపుల్ ఆర్ భూ సేకరణకు ప్రకటన విడుదల

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి చౌటుప్పల్ డివిజన్ పరిధిలో భూసేకరణకు ఆర్డీవో వి.శేఖర్‌రెడ్డి సోమవారం తుది ప్రకటన విడుదల చేశారు. డివిజన్ పరిధిలోని చౌటుప్పల్, వలిగొండ మండలాల పరిధిలో భూ సేకరణ చేసేందుకు గతంలోనే సర్వే నిర్వహించి ప్రకటన విడుదల చేసి రైతుల అభిప్రాయాలు సేకరించారు. తాజాగా 3జీ ప్రకటన జారీ చేశారు. ట్రిపుల్‌ఆర్ కోసం సేకరించనున్న భూముల వివరాలు, విస్తీర్ణం సహా జాబితాను విడుదల చేశారు. వారు తమ భూమిలోని చెట్లు, ఇతర ఆస్తుల వివరాలను తెలియపర్చేందుకు గ్రామాల వారీగా ఈ నెల 21, 22, 23, 24, 25 తేదీల్లో రైతులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆ తేదీల్లో భూ నిర్వాసితులు హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ భూమి, అందులోని ఆస్తుల వివరాలు, వాటి విలువ, బ్యాంకు ఖాతా వివరాలు ఈ సమావేశాల్లో అందజేయాలని కోరారు. అంగీకారం తెలిపి, విచారణలో వివరాలు సమర్పించినట్లయితే తమ రికార్డుల్లో నమోదైన ప్రకారం నష్ట పరిహారాన్ని లెక్కిస్తామని ప్రకటించారు.

విచారణ నిర్వహించే తేదీలు

◆ వలిగొండ తహసీల్ కార్యాలయంలో 21న పొద్దుటూరు, రెడ్లరేపాక, 22న పహిల్వాన్‌పురం, గోకారం, వర్కట్‌పల్లి.

◆ చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయంలో 23న తాళ్లసింగారం, చిన్నకొండూరు, 24న తంగడపల్లి, నేలపట్ల, 25న చౌటుప్పల్, లింగోజిగూడెం రైతులను విచారిస్తారు.

ప్రాంతీయ రింగు రోడ్డుకు సేకరించనున్న భూమి

మండలం	రైతుల సంఖ్య	భూమి (ఎకరాలు)
వలిగొండ మండలంలో..		
పొద్దుటూరు	35	5.25
రెడ్లరేపాక	15	9.08
పహిల్వాన్‌పూర్	36	12.37
గోకారం	7	8.32
వర్కట్‌పల్లి	6	1.34
చౌటుప్పల్ మండలంలో..		
తాళ్లసింగారం	16	9.36
చిన్నకొండూరు	19	8.09
తంగడపల్లి	15	14.31
నేలపట్ల	31	9.34
చౌటుప్పల్	61	129.00
లింగోజిగూడెం	41	1.34

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ : అదనపు డీసీపీ


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. నేరాల నియంత్రణపై యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ ప్రసంగించారు. సైబర్ నేరస్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని మోసాలు తెగబడుతున్నారు. .. ఉద్యోగం, వ్యాపారం పేరుతో ఫోన్లు, లింక్‌లను పంపించి జోబులు గుల్ల చేస్తారని వివరించారు. వారి బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఏసీపీ రమేశ్, సీఐ రమేశ్, ఎస్సై ఉదయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ కేంద్రాన్ని తరలించాలి


యానిమల్ కేర్ సెంటర్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు దయ్యాల నర్సింహ

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: హన్మాపురంలోని యానిమల్ కేర్ సెంటర్‌ను తరలించాలని సీపీఎం నాయకుడు దయ్యాల నర్సింహ డిమాండ్ చేశారు. పలు పార్టీల ఆధ్వర్యంలో సోమవారం కేర్ సెంటర్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే ప్రభుత్వ భూమి కేటాయించి ఎలాంటి అనుమతులు లేకుండానే శునకాల కేర్ సెంటర్‌ను నిర్మించారని ఆరోపించారు. పట్టణంలోని కుక్కలను పట్టుకువచ్చి కేంద్రంలో ఆశ్రయం కల్పిస్తుండటంతో బావుల వద్దకు వెళ్లే రైతులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు నాగపురి దేవేందర్, బూరుగు మణికంఠ, రంగ నారాయణ, కొండల్, నర్సింహ, శ్రీను, సత్యనారాయణ, రంగస్వామి పాల్గొన్నారు.

బ్యాంక్ ఎదుట రూ.50 వేలు మాయం


మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు పోతాయిగడ్డలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదుట నిలిపిన ద్విచక్రవాహన కవర్‌లో ఉంచిన రూ.50 వేలను ఓ వ్యక్తి బ్యాంక్‌లోకి వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వారు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన ఒడ్డు బాలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తను మోత్కూరులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో డబ్బులు జమ చేసేందుకు వచ్చారు. బ్యాంక్‌లో జనం ఉన్నారా? లేరా? అన్న విషయాన్ని చూసి వచ్చేందుకు లోపలికి వెళ్లారు. వచ్చి చూసేసరికి తన బైక్ కవర్‌లో ఉన్న రూ.50 వేలు చూసుకునే సరికి కనిపించలేదని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయమై ఎస్సై నాగరాజును వివరణ కోరగా.. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

లీకవుతున్న చెక్‌డ్యామ్


సదర్శాపురం వద్ద బిక్కేరువాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ నుంచి లీకవుతున్న నీరు

మోత్కూరు, న్యూస్‌టుడే: మండలంలోని సదర్శాపురం వద్ద బిక్కేరువాగుపై రూ.8.60 కోట్లతో 285 మీటర్ల మేర నిర్మించిన చెక్‌డ్యామ్ నుంచి నీరు లీకవుతుంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ చొరవతో గండమల్ల జలాశయం నుంచి మోత్కూరు బిక్కేరులోకి నీరు వదిలిన విషయం విదితమే. ఈ నీరు కొండగడప, సదర్శాపురం మీదుగా బిక్కేరు నుంచి దిగువ ప్రాంతానికి.. సదర్శాపురం వద్ద గతేడాది పూర్తయిన చెక్‌డ్యామ్ వద్దకు చేరుకున్నాయి. నిల్వ ఉండటంతో చెక్‌డ్యామ్ నుంచి నీరు లీకవుతుండటం కిందికి వెళ్తుంది, దీంతో తంగా తమ గ్రామ పరిధిలో ఉన్న జనుక బోర్లు, ఊట బావులకు నీరందని పరిస్థితి వస్తుందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలో సరైన ప్రమాణాలు పాటించక పోవడంతో లీకవుతుందని, వెంటనే సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

◆ ఈ విషయమై నీటిపారుదలశాఖ ఏఈ అమరేందర్‌ను వివరణ కోరగా.. తమ దృష్టికి వచ్చిందని, సోమవారం చెక్‌డ్యామ్‌ను పరిశీలించామని, లోపలినుంచి నీరు ఉండటంతో లీకేజీని కనిపెట్టలేక పోతున్నామని, రెండ్రోజుల్లో తగిన మరమ్మతులు చేస్తామని తెలిపారు.



భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:

సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు వచ్చి పాఠాలు చెప్పనున్నారు. డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాల కేటాయించనున్నారు. కొత్తవారి రాక సర్కారు బడుల్లో కొంత మేర ఉపాధ్యాయుల కొరత తీరనుంది. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేసింది. ఫలితాలు వెలువడిన తర్వాత ధ్రువ పత్రాలు పరిశీలించి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరికి హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. దసరాకు ముందు కొలువుల ఉత్తర్వులు పొందినా ఎక్కడ పోస్టింగ్ అనే విషయం కొలిక్కిరాలేదు. పోస్టింగ్ కోసం జిల్లా విద్యాశాఖ మంగళవారం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

ప్రాథమిక పాఠశాలలకు ఊరట

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలకు కొత్త ఊరట కలగనుంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలు చేపట్టిన తరువాత ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల కొరత కొంత ఎక్కువగా ఉంది. బదిలీ జరిగిందని సంతోషం ఉన్నా అక్కడ ఉపాధ్యాయులు లేక కొన్నిచోట్ల రిలీవ్‌లు లేక అదే స్థానంలో కొనసాగుతున్నారు.

తాజాగా కొత్త ఉపాధ్యాయుల నియామకం అవుతుండటంతో అలాంటి వారికి కాస్త ఉపశమనం కలుగనుంది.

అభ్యర్థులందరూ హాజరు కావాలి

నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు కోసం పట్టణ శివారులోని వెన్నెల కళాశాలలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో సత్యనారాయణ తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు ఉదయం పది గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన తెలిపారు. ఎస్జీటీలకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. సీనియార్టీ ప్రకారం పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయ అభ్యర్థులు నియామక ఉత్తర్వు లేఖ, నిజ ధ్రువీకరణ పత్రంతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

అసంపూర్తి పనులపై దృష్టి


డంపింగ్ యార్డులోని తడి చెత్త ప్లాట్‌ఫాంలను పరిశీలిస్తున్న సీడీఎంఏ గౌతమ్

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: రెండు పడకగదుల ఇళ్ల సముదాయంలో అసంపూర్తిగా మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఎండీ, సీడీఎంఏ గౌతమ్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన సింగన్నగూడెంలోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లను పరిశీలించి నాణ్యతతో పనులు చేయాలన్నారు. ఇళ్లను పరిశీలించి నాణ్యత చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వీటిని వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలకు రూ.3.07 కోట్లు అవసరం అవుతాయని ఇంజినీర్లు ఆయనకు వివరించారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిన నిర్మాణాల వివరాలను పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. అనంతరం మున్సిపల్ డంపింగ్ యార్డును ఆయన సందర్శించారు. తడి, పొడి చెత్తను వేరు చేసే పనులను పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. వర్మీ కంపోస్ట్ బెడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. బయోమైనింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. యార్డు నిర్వహణ మరింతగా మెరుగుపర్చాలన్నారు. ఈ సందర్భంగా పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు ఆయనను ముఖ్య అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ రామాంజులరెడ్డి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ కొండల్‌రావు, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతేరాజు 6లో..

పత్తిలో గులాబీ రంగు లక్షణాలు, నివారణ

త్రిపురారం, న్యూస్‌టుడే: పత్తిలో గులాబీ రంగు లక్షణాలు, నివారణ గురించి కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు తెలియజేశారు.



తల్లి పురుగు లేత ఆకుల అడుగు భాగాన లేత కొమ్మలు పూమొగ్గలు, లేత కాయలు, రక్షక పత్రాల పైన గుడ్లను గుంపులుగా, విడివిడిగా పెడుతుంది. గుడ్ల నుంచి బయటికి వచ్చిన కంటికి కనిపించని చిన్న లార్వాలు పూమొగ్గలలోకి తొలుచుకుని పువ్వు లోపలి పదార్థాలను తిని వీటిని గుడ్డి పూలుగా మారుస్తాయి. చిన్న లార్వాలు కాయలపై కన్నంచేసి లోపలికి ప్రవేశిస్తాయి. తరువాత కాయలకు చేసిన రంధ్రం పూడిపోయి పురుగు కాయలో ఉండి గింజలను తింటూ దూదిని బాగా నష్టపరుస్తుంది. దూది రంగు, నాణ్యత పూర్తిగా దెబ్బతింటుంది. పురుగు లార్వా దశ మొత్తం కాయలోనే గడుపుతుంది కాబట్టి మాత్రమే నష్టాన్ని గుర్తించగలం. పురుగు ఆశించిన కాయలు పూర్తిగా వృద్ధి చెందక త్వరగా పక్వానికి వస్తాయి. గులాబీ రంగు పురుగు వల్ల జరిగే నష్టం పైకి కనపడదు. కాయలు పగిలినప్పుడు మాత్రమే తెలుస్తుంది. ఎండుకట్టిన గుడ్ల నుంచి వెలువడిన వెంటనే చిన్న లార్వాలు మొగ్గలపైన, కాయల పైన కంటికి కనిపించని సన్నని రంధ్రాలను చేస్తాయి. దీని నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులను అనుసరించాలని ఆయన తెలిపారు.

నాటు కోళ్ల పెంపకం.. లాభదాయకం

రైతేరాజు

చండూరు, న్యూస్‌టుడే: కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతిలోనే చదువు మానేసి తన సొంత కాళ్లపై తాను నిలబడాలని ఉన్న ఊరిలో తన సొంత భూమిలో వ్యవసాయంతో పాటు నాటు కోళ్ల పెంపకం చేపడుతూ స్వయం ఉపాధి పొందుతూ చుట్టు పక్కల వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు చండూరు మండలం పడమటితాళ్ల గ్రామానికి చెందిన జిల్లా రాజీవ్. ఏడేళ్ల పాటు ఆటోమొబైల్ దుకాణం నడిపించి.

పోటీ ప్రపంచంలో దుకాణం నిర్వహించడం కష్టంగా భావించి వ్యవసాయ అనుబంధ రంగాలలో రాణిస్తున్న అను భవజ్ఞుల సలహాలు, సూచనల మేరకు నాటు కోళ్ల పెంపకం చేపడుతూ అధిక లాభాలు గడిస్తున్న రాజీవ్ తన అనుభవాన్ని తెలియపరిచారిలా..



నాటు కోళ్లకు దాణా వేస్తున్న రాజీవ్

ఆరు నెలల్లో వెయ్యి కోళ్లను విక్రయించా..

నాటు కోళ్లకు డిమాండ్ బాగుండటంతో ఆరు నెలల్లోనే వెయ్యి నాటుకోళ్లను పూర్తిగా విక్రయించాను. ఈ కారణం దృష్ట్యానే షెడ్డు సామర్థ్యాన్ని పెంచి ప్రతి రోజు వినియోగదారులకి కోళ్లు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేసుకుని బ్యాంక్ రుణం కోసం ఆర్జీ పెట్టుకున్నాను. రుణం మంజూరు కాగానే షెడ్డుని విస్తరించి కోళ్ల పెంపకాన్ని చేపడతాను. ఇప్పటికే విక్రయించిన తొలి బ్యాచ్ తోనే షెడ్డు నిర్మాణానికి ఖర్చు చేసిన డబ్బులు సమకూరటంతో పాటు సుమారు రూ.60వేల వరకు లాభం వచ్చింది.

రూ.5 లక్షలతో షెడ్డు నిర్మాణం..

నాలుగెకరాల వ్యవసాయ భూమిలో మూడెకరాలు పత్తి సాగు, మరో ఎకరంలో నాటు కోళ్లను పెంచేందుకు రూ.5లక్షల వ్యయంతో చుట్టూ రాతి కడీలు అమర్చి కంచె లోపల వెయ్యి నాటు కోళ్ల సామర్థ్యం కలిగిన షెడ్డును ఏర్పాటు చేశాను. భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను అమర్చి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డు పరిసర ప్రాంతాలలో వస్తే సైరన్ వచ్చే విధంగా ఏర్పాటు చేసుకున్నాను. కల్యాణి ప్రాంతం నుంచి అసిల్ జాతికి చెందిన ఒక్క రోజు నాటు కోడి పిల్లలను ఒక్కోటి రూ.45 చొప్పున కొనుగోలు చేసి నాలుగు నెలల పాటు వాటిని పెంచుతూ ఒక్కో కోడి రెండు కిలోల బరువు కాగానే చుట్టు పక్కల గ్రామాల వారికి కిలోకి రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నాను. పెట్టుబడిగా ఒక్కో కోడిపిల్లకు, దాణాకు కలిపి రూ.160 ఖర్చవుతుంది.

వెదజల్లె పద్ధతిలో వరిలో కలుపు నివారణ

త్రిపురారం, న్యూస్‌టుడే: వరిలో వెదజల్లె పద్ధతిలో వెదజల్లుకు కలుపు నివారణకు



నాటిన 25, 30 రోజులకు 2.4-డి సోడియం సాల్ట్ ను ఎకరాకు 500, 600గ్రా 2.4 డి 125-1.50 లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి జాతి, వెడల్పాకు కలుపు నివారణకు బిస్‌పైరిబాక్ సోడియంను ఎకరాకు 100 మి.లీ. అగా లీటరు నీటికి 0.5 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి 15, 20 రోజుల మధ్య పిచికారీ చేసుకోవాలి. వరి వెదజల్లె ముందు పొలంలో ఊదర, గరిక, దర్భగడ్డి, తుంగ, ఊద వంటి మొండి జాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నపుడు తొలకరి వర్షాలు పడి, కలుపు పెరుగుతున్నప్పుడు లీటరు నీటికి 5 మి.లీ. పారాక్వాట్ 24 శాతం రసాయనాన్ని, గ్లైఫోసేట్ 13.5 శాతం ద్రావణం 4 మి.లీ.లను ఒక లీటరు నీటికి కలిపి ఎక్కడ కలుపు ఉంటే అక్కడ పిచికారీ చేయాలి. ఈ మందు స్ప్రే చేసిన 10, 15 రోజుల తరువాత వరి వెదజల్లుకోవచ్చు. వెదజల్లిన 1, 2 రోజుల లోపు తేమ ఉన్నప్పుడు ఎకరాకు లీటరు పెండిమిథాలిన్ 30 శాతం (స్టాంప్, పెండిస్ట్రార్) 700 మీ.లీ. పెండిమిథాలిన్ 38.7 శాతం ద్రావకం, 400 మీ.లీ. ప్రెటిలాక్లోర్ 50 శాతం (రిఫిట్, ఎరేజ్) 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. ఈ విధంగా వరిలో వెదజల్లె పద్ధతిలో కలుపు నివారించవచ్చు.

సమస్య - సమాధానం

వేరుసెనగలో విత్తన శుద్ధి గురించి తెలపండి.

- రామయ్య, నిడమనూరు

సమాధానం: కిలో విత్తనానికి 1గ్రా. టెబ్యుకొనజోల్, 3గ్రా. మాంకోజెబ్ పొడి మందును పట్టించాలి. కాయ కుళ్లు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో ఒక మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్‌ను 2 మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేసుకోవాలి.

పత్తిలో పచ్చదోమ లక్షణాలు, నివారణ గురించి తెలపండి.

- వెంకటేశ్వర్లు, హలియా

సమాధానం: పత్తిలో పచ్చదోమ లక్షణాలు పిల్ల, తల్లి పురుగులు ఆకు అడుగు భాగాన చేరి ఆకుల నుంచి రసాన్ని పీల్చుతాయి. ఆకులు మొదట దోనెలుగా ముడుచుకుని లేత పసుపు రంగులోకి మారి ఆ తరువాత ఆకుల అంచుల నుంచి ఎర్రబడి క్రమేపి ఎండి రాలిపోతాయి. దీని నివారణకు కాండానికి మందు పూసే పద్ధతిని పాటించాలి. 30, 45 రోజులల్లో మోనోక్రోటోఫాస్‌ను 1:4 నిష్పత్తిలో, 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ నీరు 1:20 నిష్పత్తిలో పూయాలి.

వరిలో యాసంగి రకాలు తెలపండి.

- సైదయ్య, తిప్పర్తి

సమాధానం: శీతల (డబ్ల్యూజీఎల్ 283) సన్న పొడవు బియ్యం గింజ రకం ఎర్రమల్లెల (డబ్ల్యూజీఎల్ 20471) తల్లికోడు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. (జేజీఎల్ 17004) ఉల్లికోడు అగ్గి తెగులును తట్టుకుంటుంది. (ఎన్ఎల్ఆర్ 34499) అగ్గి తెగులును సమర్థంగా తట్టుకుంటుంది. ఇది సన్న గింజ రకం.

- త్రిపురారం, న్యూస్‌టుడే

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771



కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు

ఆదరిస్తే.. ప్రగతి కాంతలు..!

★ నేడు 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం'

పట్టు గొమ్మల్లాంటి పల్లెల్లో నివసిస్తున్న మహిళలు వ్యవసాయంలో రాణిస్తూ.. దేశాభివృద్ధికి తమ వంతు కృషిచేస్తున్నారు. స్థానిక వనరులను వినియోగించుకొన్న కొందరు ఆర్థికంగా, సామాజికంగా అభ్యున్నతి సాధిస్తున్నారు. సమాజంలో వేళ్లూనుకుపోయిన మూఢ నమ్మకాలు, నిరక్షరాస్యత కారణంగా చాలా మంది గ్రామీణ మగువలు ఇంకా వెనుకబడే ఉన్నారు. వారి కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలుపరిస్తే పల్లెఖ్యాతి విస్తరిస్తుంది. గ్రామాల్లో అభివృద్ధి కాంతులు వెల్లివిరుస్తాయి. పల్లెటూరి అతివల సాధికారతకు ఏటా అక్టోబరు 15న నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం' సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

చట్టసభల్లో సగమెప్పుడో..?

రాజకీయంగా చైతన్యం తీసుకొస్తే గ్రామీణ మహిళలు అభ్యున్నతి సాధిస్తారు. అందుకే ప్రభుత్వాలు స్థానిక సంస్థ ఎన్నికల్లో రాజకీయంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. కీలక నిర్ణయాలు తీసుకునే సమావేశాల్లో మహిళా ప్రతినిధులకు బదులుగా వారి భర్తలు, కుమారులు పెత్తనం చెలాయిస్తుండటంతో



అనుకున్న లక్ష్యం నెరవేరడంలేదు. దీంతో గ్రామాలను దాటి చట్టసభలకు అడుగు పెట్టే మహిళలు కరవయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాలు ఉండగా.. కేవలం ఒక్కరే మహిళా ఎమ్మెల్యే ఉండటం అందుకు నిదర్శనం.

పరిశ్రమలు వికసిస్తే..

మహిళల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం సమభావన సంఘాల ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేస్తోంది. ఆ రుణాలను సద్వినియోగం చేసుకున్న అతివలు కుట్టు, మగ్గం పని, బ్యూటీపార్లర్, పాల సేకరణ, కిరాణ దుకాణాలు, తినుబండారాల తయారీ వంటి రంగాల్లో రాణిస్తున్నారు. వారితోపాటు మరికొందరికి ఉపాధి చూపుతున్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని పరిశ్రమల్లో గ్రామీణ మహిళలను భాగస్వాములను చేయాలి.



అతివలే అత్యధికం..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం మహిళా ఓటర్లు 11,34,305 మంది ఉన్నారు. పురుషులకంటే అతివలు 22,817 మంది ఎక్కువగా ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 11,778 మంది, నల్గొండ జిల్లాలో 9,067 మంది, యాదాద్రి జిల్లాలో 1,972 మంది మహిళలు అధికంగా ఉన్నారు.

మరో నలుగురికి ఉపాధి

గాలిదేవర రాణి, శ్రీనివాసనగర్, మిర్యాలగూడ మండలం



2009లో నా భర్త రహదారి ప్రమాదంలో మరణించారు. ఇద్దరు కుమారుల భవిష్యత్తు కోసం 2010లో రూ.30వేలు, 2014లో రూ.50వేల రుణంతో రెండు గేదెలు కొని పాల విక్రయం ప్రారంభించాను. కంపసాగర్‌లోని కృషి విజ్ఞానకేంద్రంలో చిరుధాన్యాల వంటకాలపై శిక్షణ పొంది.. రూ.రెండున్నర లక్షల రుణంతో ఆహార పదార్థాల తయారీ యంత్రాలు కొనుగోలు చేశాను. ప్రస్తుతం నెలకు రూ.20వేల ఆదాయం పొందుతూ మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాను.

నారీమణులు ఎదుగుతున్నారిలా..

❒ మిర్యాలగూడలో నివసిస్తున్న వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెం గ్రామానికి చెందిన చల్లమల సందీపారెడ్డి చేతితో అలంకరణ వస్తువులు తయారు చేస్తూ మూడు గిన్నిస్ రికార్డులు సాధించారు.

❒ అనుముల మండలం హజారిగూడెం గ్రామస్థురాలు షేక్ జాహెదాబేగం ఐదు డిగ్రీలు, మూడు పీజీలు, పీహెచ్‌డీ చేశారు. లక్షా వంద పేజీల ప్రపంచంలోనే అతి పెద్ద గ్రంథం రూపకల్పనలో కీలకంగా వ్యవహరించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు.

❒ కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన మౌనిక పట్టుదలతో చదివి ఎస్సై ఉద్యోగం సాధించి గ్రామీణ మహిళలకు ఆదర్శంగా నిలిచారు.

జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి-65 పై కార్లు, ఇతర వాహనాలు సోమవారం మధ్యాహ్నం నుంచి బారులు తీరాయి. దసరా పండగకు సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్‌లో నివాసముంటున్న వారు పండగను సొంతూళ్లలో బంధుమిత్రులతో నిర్వహించుకునేందుకు పెద్ద సంఖ్యలో వారం క్రితం తరలి వచ్చారు. సెలవులు ముగిసి మంగళవారం నుంచి విద్యాలయాలు తెరుచుకోనున్నందున పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో తెలుగు రాష్ట్రాలకు వారధిలాంటి ఈ జాతీయ రహదారికి వాహనాల కళ వచ్చింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాధారణంగానే ఉన్న వాహనాల రద్దీ సాయంత్రానికి బాగా పెరిగింది. ఒకదాని వెంట ఒకటిగా కార్లు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ప్రవాహం లాగా హైదరాబాద్ వైపు పరుగులు తీశాయి. పంతంగి టోల్ ప్లాజా దాటే సమయంలో వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. అక్కడి నుంచి చౌటుప్పల్ పట్టణం దాటేంత వరకు వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడకుండా సివిల్, ట్రాఫిక్ పోలీసులు, టోల్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.



చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వెళ్తున్న కార్లు

మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి, రైతు బంధు నిధులు కాజేశారన్న కేసులో అరెస్టయిన గత హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీశ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తహసీల్దార్ జయశ్రీ, ఆపరేటర్ జగదీశ్‌లను విచారణ నిమిత్తం మూడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సోమవారం పోలీసులు పిటిషన్ వేశారు. మరో వైపు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జయశ్రీ, జగదీశ్ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం డిస్మిస్ చేసి వారిని మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ షకీల్ అహ్మద్ అన్సారి తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరినీ మూడు రోజులు పోలీస్ కస్టడీకి అనుమతించాలని కోరుతూ సీఐ చరమందరాజు పిటిషన్ వేశారు. హుజూర్‌నగర్ న్యాయమూర్తి సెలవులో ఉండటంతో కోదాడ కోర్టులో పిటిషన్ వేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం జయశ్రీని, జగదీశ్‌లను మూడు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు అనుమతితో ఈనెల 11న తహసీల్దార్ జయశ్రీని ఒక రోజు పోలీసులు విచారించిన సంగతి తెలిసిందే.

బుద్ధుడి బోధనలు ఆచరిస్తే ప్రపంచ శాంతి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నేడు ప్రపంచంలో నెలకొని ఉన్న పరిస్థితులు మారాలంటే బుద్ధుడి బోధనలు తప్పకుండా పాటించాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాగర్‌లోని బుద్ధవనంలో నిర్వహించిన దమ్మ విజయం దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు రాజ్యాధికారం కోసం యుద్ధం చేసినప్పుడు జరిగిన పరిస్థితులను చూసిన అశోకుడు శాంతిని బోధించే బౌద్ధమతాన్ని స్వీకరించారని ఆయన అనుసరించిన మార్గాన్ని అందరూ పాటిస్తే ప్రపంచం మొత్తం శాంతిగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి సాగర్ వరకు ఉన్న ప్రదేశాలను సంస్థ కారిడార్‌గా చేయాలని, హైదరాబాద్ నుంచి సాగర్‌కు ప్యాకేజీగా ఏర్పాటు చేసి ప్రతి రోజు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థకు సూచించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రితో చర్చించి బుద్ధవనాన్ని ప్రపంచంలోనే గొప్ప థీమ్‌పార్కుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, బుద్ధవనం ఓఎస్డీ సుధన్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, కౌన్సిలర్ మంగ్తా నాయక్, ఈమని శివనాగిరెడ్డి, సూర్యప్రకాశ్‌రావు, శ్యాంసుదర్, మహేంద్రహిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్, మైసూర్ బైలాకుప్పె లోని మహాబోధి బుద్ధవిహార్ నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు, హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



బుద్ధుడి పాదుకల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పర్యాటక సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, తదితరులు

శుభ ముహూర్తాలొచ్చేస్తున్నాయ్..!

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: మూడు నెలల మూఢాలు ముగిసి శుభకార్యాలకు తెర తొలిగే రోజులు సమీపిస్తున్నాయి. పెళ్లి బాజా భజంత్రీలతో సహా బరాత్‌ల మోత మోగనుంది. మరో మూడు నెలలు మంచి ముహూర్తాలు ఉన్నాయని, యాదాద్రి క్షేత్రంలోని ప్రధానాలయ పూజారులు, పంచాంగకర్తలు, బ్రాహ్మణ పూజారులు చెబుతున్నారు. వివాహ సంబంధాలు కుదుర్చుకునే క్రతువులు అంటే.. పెళ్లి చూపులు, సంబంధం ఒప్పందం, మాటాముచ్చట్లు ముమ్మరమయ్యాయి. వచ్చే నెల 3 నుంచి శుభ ఘడియలు మొదలై, 20 వరకు పన్నెండు శుభముహూర్తాలున్నట్లు పండితులు చెబుతున్నారు.



కార్తిక మాసం.. దీపావళి సంబరాలయ్యాక నవంబరు(కార్తీక మాసం)లో 3వ తేదీ రాత్రి వేళ. 7న ఉదయం, రాత్రి, 8న ఉదయం, 10వ తేదీ ఉదయం, రాత్రి, 13న ఉదయం 14న ఉదయం, 17న మూడు వేళల్లో, ఇక 20న ఉదయం మంచి ముహూర్తాలున్నాయి.

★ వచ్చే డిసెంబరు(మార్గశిరం) నెలలో 4, 5, 6, 11, 20, 25 తేదీల్లో వివాహ బంధాలకు శుభాశీస్సులు ఉన్నాయి.

మాఘ మాసంలో.. వచ్చే ఏడాది జనవరి (మాఘమాసం)లో 31న ఉదయం, రాత్రి రెండు ముహూర్తాలున్నాయి. ఫిబ్రవరి 2, 7 తేదీల్లో ఉదయం, రాత్రి, 13న ఉదయం, 14న రాత్రి, 16న మూడు వేళల్లో ముహూర్తాలున్నాయి. 20న రెండు, 22, 23 తేదీల్లో కూడా రెండేసి ముహూర్తాలున్నాయి.

ఫాల్గుణంలో.. వచ్చే మార్చి 2వ తేదీన ఉదయం రెండు, రాత్రి రెండు ముహూర్తాలు. 6వ తేదీన మూడు వేళల్లో కల్యాణ ఘడియలు ఉన్నట్లు పంచాంగకర్తలు, ప్రధాన పూజారి లక్ష్మీనరసింహాచార్య, విశ్రాంత పురోహితులు బుచ్చయ్యశర్మ తెలిపారు.

విష్ణుపురం స్టేషన్.. ఇక రైల్వే జంక్షన్!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: గుంటూరు-నడికుడి మార్గంలో నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వేస్టేషన్‌ను 'రైల్వే జంక్షన్'గా మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. 20 వేల మెగావాట్ల సామర్థ్యంతో దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద రాష్ట్రంలోనే అతిపెద్ద 'యాదాద్రి థర్మల్ ప్లాంటు'ను నిర్మిస్తుండగా దీనికి సమీపంలో ఉన్న విష్ణుపురం స్టేషన్‌ను జంక్షన్‌ని చేయాలని అధికారులు ప్రతిపాదించారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు నిత్యం 21 రైల్వే వ్యాగన్లలో కరీంనగర్ రామగుండం నుంచి బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుంది. జాన్‌పహాడ్ మార్గంలో ప్రస్తుతం ఉన్న రైల్వే లైనుకు అదనంగా మరోలైను నిర్మిస్తున్నారు.

◆ సాధారణంగా మూడు మార్గాలు కలిసే స్టేషన్‌ను జంక్షన్‌గా మార్చుతారు. గుంటూరు-బీబీనగర్ రైల్వే లైను ఇప్పటివరకు ఒకే మార్గంగా ఉండగా ప్రస్తుతం రెండు వరసలుగా విస్తరిస్తున్నారు. మిర్యాలగూడ గుంతకల్లు రైల్వే లైను సైతం ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించడంతో విష్ణుపురం స్టేషన్‌లో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది. గుంటూరు, జాన్‌పహాడ్ లైను, వీర్లపాలెం యాదాద్రి థర్మల్ ప్లాంటు రైలుమార్గాలు ఇక్కడ కలుస్తుండగా జంక్షన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం రైల్వే లైన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నందున జంక్షన్‌కు అవసరమైన విద్యుత్తు, రైల్వే సురక్షిత సౌకర్యాలు కల్పిస్తున్నారు.

◆ భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా నియంత్రించే 'కవచ్' విధానం సైతం ఇక్కడ ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు ఐదు కిలోమీటర్ల మేరకు రైల్వే లైను ఏర్పాటు చేస్తుండగా దీనికి అనుసంధానంగా జంక్షన్‌లో అవసరమైన పనులు జరిపించాలని నిర్ణయించినట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వే స్టేషన్

ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఆసియాకప్ పోటీలకు ఎంపిక

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. బీఏ తృతీయ సంవత్సర విద్యార్థిని గుగులోతు మమత యూనివర్సిటీ ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఆసియాకప్-2024కు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 19 వరకు చైనాలో జరిగే పోటీల్లో మమత పాల్గొంటారని వెల్లడించారు.



మమత

★ మరో విద్యార్థిని(ఎంపీసీ మొదటి సంవత్సరం) రుక్మిణి ఖేలో ఇండియా సౌత్‌జోన్ నేషనల్ ఖోఖో టోర్నమెంట్‌కు నల్గొండ జిల్లా నుంచి ఎంపికైనట్లు తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లకు ఎంపికైన గుగులోతు మమత, కె.రుక్మిణిని ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి కళాశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.



రుక్మిణి

విద్యుత్తుశాఖలో భారీగా బదిలీలు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ నల్గొండ సర్కిల్ పరిధిలో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. అటెండర్ మొదలుకొని డీఈ స్థాయి కేడర్ వరకు స్థానచలనం కల్పించారు. ఒకే స్థానంలో రెండేళ్ల పాటు సర్వీసు ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుని 11 కేడర్లల్లో 50 శాతం ఉద్యోగులను బదిలీ చేయాలని సంస్థ ఇది వరకే షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ నెల 6వ తేదీన బదిలీల ఉత్తర్వులు వెల్లడి కావాల్సి ఉంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వాయిదా పడింది.

బదిలీలు ఇలా.. తాజాగా ఆదివారం అర్ధరాత్రి కార్పొరేట్ కార్యాలయం నుంచి ఏఈ, ఏడీఈ, డీఈలను బదిలీ చేస్తూ ఉత్తర్వుల ప్రతులను ఆయా అధికారులకు వ్యక్తిగతంగా అందించారు. అందులో నల్గొండ డీఈ వెంకటేశ్వర్లును బదిలీ చేసి వెయిటింగ్‌లో పెట్టారు. స్టోర్ ఏడీఈ నాగిరెడ్డి హైదరాబాద్‌కు, నల్గొండ రూరల్ ఏడీఈ సత్యనారాయణ సూర్యాపేట స్టోర్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో నల్గొండ డీఈగా అన్నయ్య హైదరాబాద్ నుంచి పదోన్నతిపై, భువనగిరి డీఈ రవిప్రసాద్‌ను నల్గొండ ఎంఆర్టీ విభాగానికి (ఇన్‌ఛార్జి ఎస్ఈ నల్గొండ), మిర్యాలగూడ డీఈగా సుధీర్‌కుమార్, నల్గొండ స్టోర్ ఏడీఈగా శంకరయ్యయాదవ్, హాలియా ఏడీగా తిరపతయ్య, నల్గొండ రూరల్ ఏడీఈగా బల్యానాయక్, ఖర్చుల విభాగం ఏఏవోగా రవికృష్ణ, నల్గొండ టీఆర్ఈ ఏడీఈగా శ్రీనివాస్‌రెడ్డి, నల్గొండ స్టోర్ ఏఈగా వెంకటేశం నిర్మాణం విభాగం డీఈ బి.వెంకటయ్య బదిలీపై వచ్చారు. వీరితోపాటు మరి కొంత మంది ఏఈ, ఏడీఈలు బదిలీ అయ్యారు. సోమవారం సర్కిల్ కార్యాలయ పరిధిలోని ఉద్యోగులతోపాటు నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్ స్థాయిలో అసిస్టెంటు లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ల స్థాయి వరకు సుమారు 350 మంది ఉద్యోగులకు స్థాన చలనం కల్పించారు. కొంత మంది అధికారులు బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పైరవీలకు పెద్దపీట..!..

విద్యుత్తుశాఖ పరిధిలో ఉద్యోగుల బదిలీల్లో పైరవీలకు పెద్దపీట వేసినట్లు ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అధికారులు తిలోదకాలిచ్చారు. చేతులు తడిపిన వారికి కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారని, సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు బదిలీ కావాల్సిన ఉద్యోగులను పనిచేస్తున్న సెక్షన్‌లోనే బదిలీ చేయడం, రెండేళ్ల సర్వీసు నిండని ఉద్యోగులకు సైతం స్థాన చలనం కల్పించడం అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. అధికారుల తీరుపై కొంత మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సైతం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

పురుగు మందు తాగి బలవన్మరణం

మునుగోడు, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మునుగోడు మండలం కచిలాపురంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిట్టా ముత్తయ్య (55) వృత్తి రీత్యా వ్యవసాయ కుటుంబం. మద్యానికి బానిసైన ఆయన నిత్యం తాగి వస్తుండటంతో పలుమార్లు కుటుంబ సభ్యులు మందలించినా వదలడం లేదు. మద్యం తాగొద్దని చెబితే పురుగు మందు తాగి బలవన్మరణం చేసుకుంటానని ఇటీవల ఒక్కసారి బెదిరింపులకు గురి చేశారు. కనీసం సమయానికి తిండి తినకుండా మళ్లీ కొద్ది రోజులుగా నిత్యం మద్యం తాగుతుంటే ఆరోగ్యం క్షీణిస్తుందనే ఉద్దేశంతో తాగొద్దని మందలించడంతో మరోసారి బెదిరించేందుకు ప్రయత్నం చేశారు. సోమవారం తన వ్యవసాయ బావి వద్దకి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బావి వద్దకు వెళ్లిన వ్యక్తి ఇంటికి రాలేదని అనుమానంతో ఆయన భార్య అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే స్థానికుల సాయంతో మునుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 108లో నల్గొండ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126-00
రిటైల్	146-00
డ్రెస్డ్	215-00
స్కిన్‌లెస్	244-00

బాబోయ్ కంపు



మోత్కూరు, న్యూస్‌టుడే: చెరువు నుంచి పలు బావుల మీదుగా, గ్రామం నుంచి వెళ్లే నీటి కాల్వను పూడ్చివేయడంతో గ్రామంలో మురుగు నీరు వెళ్లక దుర్వాసనతో, దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని మండలంలోని ముశిపట్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక చెరువు తూము నుంచి ఉన్న కాల్వ చాకలి, కదిరోని, దేవతల, ఊర, సుద్ద, ఎలిమినేటి బావుల చెంతగా ఊరి మురుగునీరును కలుపుకొని మొట్లకుంటకు వెళ్లేందుకు పూర్వం కాల్వను నిర్మించారు.

■ ఈ కాల్వను చివరలో ఆరునెలల క్రితం స్థానిక నాయకుడొకరు తన పొలం పక్కనుంచి పోవద్దని పూడ్చివేశారు. గ్రామస్థులు తిరిగి తోడినప్పటికీ మళ్లీ ఆ నాయకుడు పూడ్చివేశారు. దీంతో గ్రామం నుంచి మురుగు నీరు వెళ్లకపోవడంతో గ్రామంలో, గ్రామపంచాయతీ వద్దనే పెద్దఎత్తున నిలిచి కంపు కొడుతోంది. పంచాయతీ కార్యదర్శికి, ప్రత్యేకాధికారికి చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు వాపోయారు.

■ ఈ విషయమై ఎంపీడీవో నిరంజన్ వలిని వివరణ కోరగా.. ఆ కాల్వ స్థానంలో గ్రామ పరిధిలో భూగర్భజల మురుగు కాల్వ నిర్మించేందుకు రూ.2.80 లక్షలు మంజూరయ్యాయని రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా



వలిగొండ: మర్లపాడులో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

వలిగొండ, భువనగిరి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రతి వ్యక్తికి ప్రస్తుతం 5 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం సరఫరా చేస్తోంది. ఉచితంగా వస్తున్నాయన్న నిర్లక్ష్యమో, లేక అమ్ముకుంటే డబ్బులొస్తాయన్న ఆశనో గానీ కొందరు లబ్ధిదారులు మాత్రం తమకు వచ్చిన రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు ద్విచక్రవాహనాలపై పల్లెల్లో ఇంటింటా తిరుగుతూ లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. వాటిని రైస్ మిల్లులు, ఇతర వ్యాపారులకు, కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడి నుంచి పెద్ద వ్యాపారులు లారీలో లోడు చేసుకొని జిల్లా సరిహద్దు దాటించేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. అధికారులు నిఘా పెట్టకపోవడంతో రేషన్ బియ్యం యథేచ్ఛగా పక్కదారి పడుతోంది. పట్టుబడిన వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలిపెడుతున్నారని లోతుగా దర్యాప్తు చేయడం లేదని, అందుకే వ్యాపారుల తీరు మారడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

కేసుల వివరాలు:

☛ సెప్టెంబరు 16న యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మల్కాపురానికి చెందిన మాలోతు బాల్య, జనగాం జిల్లా రఘునాథపురం మండలం లక్ష్మి తండాకు చెందిన బానోతు సునీల్ వాహనంలో 9.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా వలిగొండ మండలం మర్లపాడు వద్ద పోలీసులు పట్టుకొన్నారు.

☛ ఆగస్టు నెలలో వలిగొండ మండలం ముద్దాపురం గ్రామ పరిధిలో ఓ వ్యవసాయ క్షేత్రంలో నిల్వ చేసిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొన్నారు.

పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశాం

– శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్, వలిగొండ

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశాం. ఈ మేరకు రెవెన్యూ ఆర్‌ఐలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశాం. రేషన్ దుకాణాల్లో తరచూ తనిఖీలు చేపడుతూ, పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

అఖిలపక్షం ఆధ్వర్యంలో నేడు సదస్సు

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటును నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈసదస్సుకు గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఊట్కూరి నర్సింహ, జల్లెల పెంటయ్య, పోచబోయిన మల్లేశం, ఎం.డి.నాసర్, ఫజల్‌బేగ్, బొడ్డుపల్లి వెంకటేశం, ఎం.డి.జమీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

కాలుష్య నియంత్రణకు చర్యలు.. బీబీనగర్: బీబీనగర్ మండల ప్రజలకు ఎలాంటి హానీ కలగకుండా వాయు, జల కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎంఎస్ఎన్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనల ప్రకారం తమ యూనిట్‌ను నిర్వహిస్తామని వెల్లడించారు. అంతర్గత పర్యవేక్షణ చేపడతామని, ప్రజల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి.. రాజపేట: మండలంలోని బొందుగుల గ్రామానికి చెందిన కంచర్ల రామచంద్రారెడ్డి పాడిగెదె సోమవారం తెల్లవారుజామున విద్యుదాఘాతానికి గురై మరణించింది. పశుగ్రాసం మేస్తున్న క్రమంలో విద్యుత్తు నియంత్రిక వద్ద గల తీగకు తగిలి పాడిగేదె అక్కడికక్కడే మృతిచెందింది. ఘటనతో సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు.

పిడుగు పాటుకు.. తుర్కపల్లి: తుర్కపల్లి మండలం బాబుల్‌నాయక్‌తండాలో సోమవారం పిడుగు పడి గేదె మృతి చెందింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రైతు మోతీలాల్ పశువులను మేపుతుండగా వర్షం రావడంతో సమీపంలో ఉన్న గుడి వద్దకు పరుగులు తీశారు. ఆదే సమయంలో పిడుగు పడి అతని గేదె మృతి చెందింది.

గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాలు.. ఆలేరు: ఆలేరు మండలంలో ఈ నెల 15వ తేదీ నుంచి సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆలేరు పశువైద్యాధికారిణి పి.చైతన్య సోమవారం చెప్పారు. పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటన్నారు. గ్రామాల వారీగా నిర్ణయించిన తేదీలలో జరుగుతాయన్నారు.

నూతన కమిటీ ఎన్నిక.. మోటకొండూరు: మండల కేంద్రంలో ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అంగడి యాదగిరి, గౌవర అధ్యక్షుడిగా దేవరాజు స్వామి, ప్రధాన కార్యదర్శులుగా బొలుగుల రమేష్, బొలుగుల నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా దేవరాజు పషయ్య, అంగడి ఆంజనేయులు, దేవరాజు మహేష్, కోశాధికారిగా బాణపురం రమేష్ ఎన్నికయ్యారు.

భువనగిరిలో 17న టార్చ్ ర్యాలీ... భువనగిరి పట్టణం: సీఎం కప్-2024 నిర్వహణలో భాగంగా పట్టణంలో ఈ నెల 17న టార్చ్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి ధనంజేయులు తెలిపారు. జనగామ జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్‌కు ఈ నెల 17న ఉదయం ఎనిమిది గంటలకు టార్చ్ వస్తుందని, కలెక్టరేట్ నుంచి భువనగిరి కోట వరకు ర్యాలీని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులు, క్రీడా అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులు, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

విద్యుత్తు శాఖ డీఈగా మల్లికార్జున్.. చౌటుప్పల్: విద్యుత్తు శాఖ చౌటుప్పల్ డీఈగా డీఎస్ మల్లికార్జున్ ఉద్యోగ బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు భువనగిరి డీఈగా పని చేశారు. ఏడీఈగా శ్యామ్‌ప్రసాద్ ఇదే రోజున బాధ్యతలు తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈ, ఏడీఈలను డివిజన్ పరిధిలోని విద్యుత్తు శాఖ ఏఈలు సతీష్, దివ్య, నర్సింహ, సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీబీనగర్ ఏడీఈ బాధ్యతల స్వీకరణ.. బీబీనగర్: బీబీనగర్ సబ్‌డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా మత్స్యేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బీబీనగర్, బొమ్మలరామారం మండలాలకు ఏడీఈగా విధులు నిర్వర్తిస్తారు. ఇంతకు ముందున్న ఏడీఈ ఆర్.కృష్ణయ్య డీఈగా పదోన్నతిపై బదిలీపై వెళ్లారు.

ఐవీఎఫ్ జిల్లా కార్యాలయంలో అలయ్ బలయ్.. భువనగిరి: దసరా పురస్కరించుకొని ఐవీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం అలయ్ బలయ్ నిర్వహించారు. ఐవీఎఫ్ తెలంగాణ ధార్మిక పరిషత్ ఛైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య, ఐవీఎఫ్ జిల్లా వాణిజ్యశాఖ అధ్యక్షుడు కుక్కుటపు చంద్రశేఖర్‌గుప్తా, పట్టణ అధ్యక్షుడు రాములు, వాసవిక్లబ్ భువనగిరి అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బిజ్జాల మహేష్ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.. చౌటుప్పల్: ఆచార్య సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ అన్నారు. చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం పురపాలిక కమిటీ కార్యదర్శి బండారు నర్సింహ, నాయకులు రామేశ్వరి, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, శ్రీను, ధర్మారెడ్డి, ఊషయ్య, అంజిరెడ్డి, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో శతఘటాభిషేకం.. సంస్థాన్ నారాయణపురం: మండలంలోని అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో సోమవారం శతఘటాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ శంకరానంద స్వామిజీ ఆధ్వర్యంలో ప్రాచీన శివాలయం నుంచి స్థానిక చౌరస్తా రామాలయం వరకు అక్కడి నుంచి ఆశ్రమం వరకు మహిళలచే ర్యాలీ నిర్వహించారు.

మిగులు భూములు పేదలకు పంచాలి.. భువనగిరి గ్రామీణం: ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. ముత్తిరెడ్డిగూడెంలో సోమవారం కొండ అశోక్ అధ్యక్షతన జరిగిన సీపీఎం గ్రామ పదో మహాసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని 259 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఇళ్లులేని పేదలకు 200 గజాల చొప్పున కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, నాయకులు కొండమడుగు నాగమణి, కూకుట్ల కృష్ణ, కొండ లక్ష్మయ్య, కాసారం మల్లయ్య, కొండ హైమవతి, చొక్కా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల ఎంపికలో రాజకీయ జోక్యం వద్దు



చిమిర్యాల గ్రామంలో సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీల ఎంపికలో రాజకీయ జోక్యం వద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. మండలంలోని చిమిర్యాల గ్రామంలో సోమవారం జరిగిన పార్టీ 12వ మహాసభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పథకాల విషయంలో రాజకీయ జోక్యం వల్ల ప్రజలకు దూరమైన విషయం అందరికీ తెలుసన్నారు. అనంతరం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా సుర్వి కిరణ్‌ను, మహిళా కార్యదర్శిగా పల్లెపల్లి లలితను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దోనూరు నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు గుంటోజు శ్రీనివాసాచారి, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, పెద్దులు, నర్సిరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలు.. మత్తు పదార్థాలపై అవగాహన

గుండాల, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండాల ఎస్సై జి.సైదులు ప్రజలకు సూచించారు. సోమవారం గుండాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ ద్వారా సంప్రదించినప్పుడు మీ వ్యక్తి గత సమాచారం వారికి ఇవ్వవద్దని, ఫోన్‌కు వచ్చే అవాంఛిత సందేశాలు తెరవొద్దని సూచించారు. మత్తు పదార్థాలు, సైబర్ నేరాల సమాచారం తెలిసిన వెంటనే



గుండాలలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గుండాల ఎస్సై సైదులు

ఠాణాకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గురువయ్య, వెంకన్న, ప్రశాంత్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ ఎండీ తక్యూద్దీన్ సూచించారు. దత్తాయిపల్లి గ్రామంలో సోమవారం యువకులతో సమావేశమై ఆయన మాట్లాడారు. గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. నిషేధిత మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని లక్కారంలోని అండర్‌పాస్ వంతెన పక్కన గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా 108 అంబులెన్సులో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపారు. మృతుని వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదని తెలిపారు. మృతుడు నీలం రంగు బనియన్ ధరించి ఉన్నాడని చెప్పారు. పూర్తి వివరాలకు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, మృతుని ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

వివాహిత ఆత్మహత్య

భువనగిరి గ్రామీణం: విషం తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని నమాత్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడకు చెందిన మమత(27) భర్త వీఎం చిన్నాతో గొడవల కారణంగా వేరుగా ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు(6) ఉన్నాడు. నమాత్‌పల్లికి చెందిన సాయికుమార్‌రెడ్డి తనకు డబ్బులు ఇవ్వాల్సి ఉండగా ఆదివారం అడిగేందుకు వచ్చారు. ప్రస్తుతం తన వద్ద లేవని చెప్పడంతో వాదోపవాదాలు జరిగాయి. మరోవైపు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక తనకు రావాల్సిన డబ్బుల రాకపోవడంతో మనస్తాపానికి గురై విషం తాగింది. గ్రామ శివారులోని వంతెన వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించి గ్రామస్థులు సాయికుమార్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా మమతను భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సాయంత్రం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు గమనించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

మాజీ సర్పంచి కన్నుమూత

ఆత్మకూరు(ఎం): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కడకంచి మల్లయ్య(76) సోమవారం రాత్రి మరణించారు. 2006 నుంచి 2011 వరకు ఆయన సర్పంచిగా పనిచేశారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషిని గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు గుర్తు చేసుకుని నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వలిగొండ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నాగారం పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది కథనం ప్రకారం... నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చిన్న తుమ్మలగూడెం గ్రామానికి చెందిన బొబ్బిలి నితిన్, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి చెందిన చీల్ల సురేశ్ కలిసి ద్విచక్రవాహనంతో వలిగొండలో బంధువుల ఇంటికి వెళ్లారు. పని ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా నాగారం పరిధిలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో నితిన్, సురేశ్ ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రామన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

తాళం పగులకొట్టి చోరీ

మోత్కూరు: మండలంలోని ఆరెగూడెం రోడ్డులో చేకూరి మల్లేశ్ దసరా పండగ సందర్భంగా భార్య పిల్లలతో కలిసి అత్తగారి ఇంటికి వెళ్లారు. ఆదివారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయటంతో రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, మోత్కూరు ఎస్సై డి.నాగరాజు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చౌటుప్పల్ గ్రామీణం: చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామంలో జరిగిన దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మయ్య సోమవారం తెలిపారు. పడసగోని ప్రవీణ్‌ను గంగనోయిన మహిపాల్‌తో పాటు మరికొంత మంది దాడి చేసి ఆదివారం సాయంత్రం గాయపరిచారు. ఈ విషయమై అనంతుల సాయికిరణ్ ప్రవీణ్‌పై ఎందుకు దాడి చేసి గాయపరిచారని అడిగేందుకు మహిపాల్ వద్దకు వెళ్లి అడగగా మళ్లీ దాడి చేశారు. ఈ ఘటనలో సాయి కిరణ్ తలకు తీవ్రంగా గాయం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. గంగనబోయిన మహిపాల్ కూడా పడసగోని ప్రవీణ్, అనంతుల సాయికిరణ్, లింగస్వామిలు తమపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ పర్యవేక్షణలో దాడిపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వైద్య విద్యార్థినికి రూ.1.65 లక్షల విరాళం



గౌరికి రూ.1.65లక్షల చెక్కును అందజేస్తున్న కేటీఆర్, దూడల రవీందర్

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన ఎన్‌ఆర్ఐ దూడల వెంకట్‌గౌడ్, దాత సీసా రమేష్ పేదింటి అమ్మాయి వైద్యవిద్య కోసం రూ.1.65లక్షల సాయాన్ని ప్రకటించి ఉదారత చాటారు. వనపర్తి జిల్లా కల్వరాలకు చెందిన బోరెల్లి గౌరికి సంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. గౌరి కుటుంబం పేదరికంలో ఉండటం, గౌరి తల్లిదండ్రులకు ముగ్గురు ఆడ సంతానం కావడంతో ఫీజు చెల్లించలేని పరిస్థితి. అమెరికాలో ఉంటున్న వెంకట్‌గౌడ్, రమేష్ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నారు. గౌరి కళాశాలలో చేరేందుకు అవసరమైన ప్రవేశ రుసుం, మొదటి సంవత్సరం రుసుం మొత్తం రూ.1.65 లక్షలు అందించేందుకు ముందుకు వచ్చారు. చెక్కు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేతుల మీదుగా సోమవారం తెలంగాణ భవన్‌లో గౌరికి అందజేశారు. ఎన్‌ఆర్ఐ వెంకట్‌గౌడ్ తరఫున ఆయన తండ్రి దూడల రవీందర్ పాల్గొన్నారు.

అఖిలపక్ష పోరాటానికి సంపూర్ణ మద్దతు

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అఖిలపక్షం చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలో ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పూస బాలకిషన్ జన్మదిన వేడుకలను కేంద్రంలో సోమవారం నిర్వహించారు. అనంతరం



రామన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు హాని కల్గించే ఈపరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు. ఈ అంశాన్ని జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడ్తున్న సంక్షేమ పథకాలపై కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సిరిగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, గంగుల రాజిరెడ్డి, మేక అశోక్‌రెడ్డి, నంద్యాల భిక్షంరెడ్డి, జినుకల ప్రభాకర్, గోదాసు పృథ్వీరాజ్, గుత్తా నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా

భూదాన్‌పోచంపల్లి: బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తడ్క వెంకటేశం సోమవారం ప్రకటనలో తెలిపారు. పదవిలో లేకపోయినా పార్టీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

రుసుం చెల్లించకుంటే నిర్వహణ కష్టం



భువనగిరి: కళాశాలను మూసివేసి నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, యాజమాన్య ప్రతినిధులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థులకు బోధనా రుసుములు చెల్లించని కారణంగా పరోక్షంగా లక్షలాది మంది ఉపాధిని కోల్పోతున్నారని తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఆర్థిక కార్యదర్శి దర్పల్లి ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం శ్రీసాయికృప డిగ్రీ కళాశాలను మూసివేసి గేటు ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బకాయిలు చెల్లించని కారణంగా నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులు మణిపాల్ రెడ్డి, ధనుంజయ్, గిరిబాబు, సురేందర్, మల్లేశం, మధిర మల్లేశం, కొలను శ్రవణ్‌రెడ్డి, భిక్షం, వెంకటేష్, రామకృష్ణ, వీరయ్య పాల్గొన్నారు.

మోత్కూరు: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వని కారణంగా డిగ్రీ కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం మేరకు సోమవారం మోత్కూరులోని సంతోష్ డిగ్రీ కళాశాల నిర్వాహకులు కళాశాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్.సత్యంగౌడ్, ప్రిన్సిపల్ బి.విజయ్‌కుమార్, సాయిరాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.నర్సింహా, డైరెక్టర్లు రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరసన.. వలిగొండ: బోధన రుసుములు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వలిగొండ మండల కేంద్రంలోని ప్రగతి డిగ్రీ కళాశాల గేటుకు అధ్యాపకులు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వారిలో రాపోలు ప్రణయ్‌కుమార్, ఈతాప శ్రీశైలం, దంతూరి గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరుగుతున్నాయని, వీటిపై పోరాడేందుకు సిద్ధం కావాలని 'ఐద్వా' జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి ప్రజలను కోరారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్న 'ఐద్వా' రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను ఆమె చౌటుప్పల్‌లో సోమవారం విడుదల చేసి మాట్లాడారు. ఐద్వా పురపాలిక కమిటీ అధ్యక్షురాలు ఎండి హర్షియా, జిల్లా కమిటీ సభ్యురాలు దొడ్ల అండాలు, రేష్మ, జయమ్మ పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో గోడ పత్రికలు విడుదల చేస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రామేశ్వరి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రభుత్వవిప్ అయిలయ్య, పీసీసీ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, తదితరులు

ముఖ్యమంత్రిని కలిసిన విప్

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. జమ్మి పత్రిని అందజేశారు. రానున్న రోజుల్లో ఆలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధికి నోచుకుంటుందని ఇందుకు ప్రభుత్వపరంగా మరింత సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారని ప్రభుత్వవిప్ అయిలయ్య 'న్యూస్‌టుడే'తో చెప్పారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 18 వినతులు అందజేశారు. వచ్చిన వాటిలో రెవెన్యూశాఖకు సంబంధించి ఆరు, జిల్లా పంచాయతీ అధికారి 4, ఉపాధి కల్పనాశాఖ మూడు, డీఈఈ హౌసింగ్, మున్సిపాలిటీ, అటవీ, పోలీస్, ఆరోగ్యశాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు చొప్పున వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, జడ్పీ సీఈవో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ హన్మంత్ కె.జెండగేకు వినతిపత్రం అందజేస్తున్న అర్జీదారులు

పెంచిన పింఛను అమలు చేయండి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు రూ.6 వేల పింఛను వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో మాట్లాడారు. తీవ్ర వైకల్యం కలిగిన దివ్యాంగులకు ప్రత్యేక అలవెన్సు ఇవ్వడానికి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. జనాభాలో దివ్యాంగుల లెక్కలు తీయాలని, నియమిత పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. అంత్యోదయ రేషన్ కార్డుపై 35 కిలోల బియ్యం ఇవ్వాలని, సాధికారతపై ప్రత్యేక పథకాల ద్వారా దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. దివ్యాంగుల సమస్యలపై ఈ నెల 25, 26న హైదరాబాద్‌లోని సుందరయ్య భవనంలో సంఘ మహాసభ నిర్వహించడమైందని, ఈ సభకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుర్పంగ ప్రకాశ్, గౌరవ అధ్యక్షుడు పోశెట్టి, నాయకులు రంగ సంతు, రాణి, రాజు, మునీర్, విజయ్, హరి, లక్ష్మీనారాయణ, విజయ్, వెంకటేశం, మహేశ్, బాలయ్య, కనకయ్య, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కుంభం



భూదాన్‌పోచంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సామ మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వలిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని ముద్దాపురం మదిర గ్రామం కొడమర్లబావికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దూది నర్సిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శించి నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేశ్‌రాజు, చిట్టెడి జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, వాకిటి అనంతరెడ్డి, బత్తిని సహదేవ్, పులిపలుపుల శ్రీరాములు, రసూల్ పాల్గొన్నారు.